

నలుగురికి కారుణ్య నియామక పత్రాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఉత్తర్వుల మేరకు కారుణ్య నియామకాల ద్వారా నలుగురు అభ్యర్థులను జిల్లాలోని వివిధ శాఖలలో నియమిస్తూ కారుణ్య నియామక పత్రాలు అందజేయడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్పందన హాల్‌లో డిఆర్‌ఓ యన్.రాజశేఖర్ కలసి నలుగురికి ఉద్యోగ నియామకం పత్రాలను జేసి అందజేశారు. ఇందులో భాగంగా సి.దివాకరరెడ్డిని డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కార్యాలయం చిత్తూరు, జూనియర్ సహాయకులుగా, వి.అప్రిన్‌ను వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్ కార్యాలయం చిత్తూరులో జూనియర్ సహాయకులుగా, కె.ఆర్షద్ అలీ, కె.ప్రసాద్‌ను చిత్తూరు ఆర్డిఓ కార్యాలయం ఆఫీస్ సుబార్డినెట్‌లుగా నియమిస్తున్నట్లు నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేసినట్లు జేసి తెలిపారు.



జానపదం కదిలింది.. కలెక్టరేట్ అదిరింది..



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కాళ్ళకు గజ్జలు, చేతిలో డప్పులు కోలాట కర్రలు, చెక్క భజన చెక్కలతో పిల్లన గ్రోవులతో పల్లెల నుండీ జానపద కళాకారులు చిత్తూరు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జానపద వృత్తి కళాకరుల సంఘం పిలుపు మేరకు సోమవారం భారీ సంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకున్న జానపద వృత్తికళాకారులు సాంప్రదాయ జానపద కళళలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందంటూ నినదించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్న చిన్న వృత్తులతో పాటు జానపద కళళ పట్ల మక్కువతో చెక్క భజనలు, పండరి భజనలు, కులుకు భజనలు, కోలాటం, పిల్లన గ్రోవి సాంప్రదాయ గ్రామీణ నృత్యాలు, పాటలు నేర్చుకొని సాంప్రదాయ జానపదానికి జీవం పోస్తున్న కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజురు చేయడంతో పాటు స్థానికంగా నిర్వహించి ఏ కార్యక్రమమైనా.... జానపద కాళాకారులకు అవకాశం కల్పించడంతో పాటు ప్రముఖ్య పుణ్యక్షేత్రాలు టిటిడి, కాణిపాకం, శ్రీకాళహస్తి ఇతర దేవాలయాల్లో నిర్వహించే బ్రహోత్సవాల్లో తమ కళళను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించాలంటూ సోమవారం కలెక్టర్ ఎదుట తమ కళలను ప్రదర్శించారు. అనంతరం జానపద కళాకారుల సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకీ జానపద కలలు కనుమరుగవుతున్నాయని వాటిని కాపాడాల్సిన పాలకులు అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. సంఘం ఆధ్వర్యంలో గతంలో అనేక పోరాటాలు చేసిన ఫలితంగా గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చి కూడా ఇప్పటివరకు గుర్తింపు కార్డులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. స్థానికంగా ఉన్న ఆలయాల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించి కళాకారుల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కళాకారులకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల పనులు చేసుకుంటూ కలలను ప్రదర్శిస్తున్న కళాకారుల నిర్లక్ష్యం చేయడం సరైందికాదన్నారు. కళాకారుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను పెంచుతున్న జానపద వత్తి కళాకారుల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి హైటెక్ కళాకారులు కావాల్సి వస్తుందని నిజమైన కళాకారులు జానపద కళాకారులే అని గుర్తుపెట్టుకోవాలని తెలిపారు. కళాకారులు ఎవరూ గొంతెమ్మ కోరికలు కోరడం లేదని గతంలో ఇచ్చిన హామీలు ప్రకారమే కళాకారుల సమస్యలను పరిష్కారం చేసే దిశగా అధికారులు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాకారుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సిఐటియు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లాలో ఉన్న 50 రకాల కళలు నేడు కేవలం 15 మాత్రమే ఉన్నాయంటే వీరిపై ఎంత నిర్లక్ష్యధోరణ వ్యవహరిస్తున్నదో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇప్పటికైనా జిల్లాల అధికారులు స్పందించి జిల్లాలో ఉన్న జానపద కళాకారులకు అందరికీ గుర్తింపు కార్డులు ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈసమస్యలు పరిష్కారం కాకపోతే పోరాటం ఉధతం చేస్తారని హెచ్చరించారు. వేలాది మంది కళాకారులు కలలను ప్రదర్శిస్తున్న జిల్లా అధికారులు కనీసం వారిని



పలకరించకపోవడం సిగ్గుచేటు అన్నారు. జానపద నత్య కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు రామచంద్ర, జిల్లా కార్యదర్శి రవికుమార్, గౌరవాధ్యక్షులు సురేంద్రన్‌లతోపాటు వేలాది మంది కళాకారులు పాల్గొన్నారు.

స్పందనకు 308 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

స్పందనలో వచ్చిన అర్జీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన హాల్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, డిప్యూటీ కలెక్టర్ భవాని, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారితో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం-308 అర్జీలు రాగాశాఖల వారీగా రెవెన్యూ శాఖకు సంబంధించి 200, ఎండోమెంట్ 1, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ 1, జిల్లా పంచాయతీశాఖ 1, పోలీసు శాఖ 4, డిఎస్‌ఎల్‌ఓ 1, డిఎస్‌ఓ 1, జిల్లా విద్యాశాఖ 1, డిఆర్‌డిఏ 1, డిపిఓ 1, నేషనల్ హైవే 1, ఆర్‌టిసి 2, డిఎంహెచ్‌ఓ 3, నగరపాలక సంస్థ 2, ఎస్‌పిడిసిఎల్ 1, హౌసింగ్ శాఖ 7, డిసిహెచ్‌ఎస్ 1, డిఎఫ్‌ఓ 1, ఎస్సీ కార్పొరేషన్ 1, ఐఆర్‌పిఆర్ 7, డిసిఓ 10, పెన్షన్, రేషన్ కార్డులు ఇతరులు 60 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు, జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఓకు తమ వినతులను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు గైకొని పరిష్కరించాల్సిందిగా జేసి జిల్లా అధికారులను ఆదేశించారు.

పురపాలక కార్యక్రమంలో తొమ్మిది వినతులు



స్పందన కార్యక్రమంలో నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం తొమ్మిది వినతులు అందినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని పలువురు నగర ప్రజలు వినతిపత్రాలు అందించారు. ప్రజల నుంచి అందిన వినతులపై శాఖాధిపతులు సత్వరం విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ 5, ప్రజారోగ్య విభాగం 2 మెప్మా 1, టీపీవో 1 చొప్పున మొత్తం 9 వినతులు అందాయి. అనంతరం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు నిర్వహించిన స్పందన వీడియో సమావేశంలో కమిషనర్ పాల్గొన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం, ఏపీ సేవా పోర్టల్ సర్వీసులపై నగర పాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట ప్రసాద్, ఏసీపీ రామకష్ణుడు, సీఎంఎం గోపి, మేనేజర్ తనూజ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో 28 ఫిర్యాదులను స్వీకరించిన అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్, ఎస్ఐబి అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా ఎఆర్ పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి 28 ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా అడిషనల్ ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ అడిషనల్ ఎస్పీ బాధితుల ఎదుటే వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు.

వేగంగా డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డ్రైనేజీ నిర్మాణం, మట్టి నింపే పనులు వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని గాంధీ రోడ్ విద్యుత్ కార్యాలయం వెనకవైపు జరుగుతున్న డ్రైనేజీ పనులను కమిషనర్ సోమవారం మధ్యాహ్నం తనిఖీ చేశారు. డ్రైనేజీ కాలువకు ఇరువైపులా ఉన్న ఖాళీస్థలంలో పూర్తిగా మట్టితో నింపాలన్నారు. పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంఈ వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' సమస్యలు పరిష్కరించండి : జెసి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలు రీఓపన్ కాకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశం హాల్ నందు డిఆర్‌ఓ యన్.రాజశేఖర్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్‌డిఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహసీల్దార్లు, ఎంపిడిఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జగనన్నకు చెపుదాం, స్పందనలో వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా సాధ్యమైనంత వరకు తగ్గించడానికి ఎంపీడీవోలు మండల తహశీల్దార్లు ప్రయత్నం చేయాలని, రీఓపన్ అయిన వాటిని 24, 48 గంటల లోపల సంబంధిత అర్జీదారునితో మాట్లాడి వారికి ఎండాస్మెంట్ ఇవ్వాలని, పరిష్కరించడంతో పాటు అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకి పోకుండా రీఓపెన్‌కి అవకాశం లేకుండా పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అలాగే మండలాల వారీగా ఈకేవైసీ వందశాతం ఆడిట్ పూర్తి చేయాలని, సచివాలయ సిబ్బంది ఈకెవైసి చేసిన తర్వాత మళ్ళీ ఒకసారి తహశీల్దార్ల, ఎంపిడిఓలు వేరిఫికేషన్ చేసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఈ కేవైసీ మంగళవారం సాయంత్రం కల్లా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. కొన్ని మండలాలలో వంద శాతం పెండింగ్‌లో ఉందని, మండలాల అధికారులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బదిలీలైన వీఆర్వోలు వెంటనే కొత్త మండలాల్లో జాయినింగ్ అవ్వాలని, ఇంకా జాయినింగ్ అవ్వని వీఆర్వోల సంబంధించి రిపోర్టును మంగళవారం మధ్యాహ్నం కల్లా జేసీకి అందజేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. జగనన్న సురక్ష క్యాంపులు సంబంధించి ఈ నెల 29వ తేదీ వరకు మనకు షెడ్యూల్ ఉందని చాలా వరకు అన్ని పూర్తి చేయడం జరిగిందని, ఇంకా చేయవలసిన సచివాలయాలకు సంబంధించి మండలలో తహశీల్దార్లు, ఎంపీడీవోలు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని మండలాలకు జగనన్న సురక్ష క్యాంపులకు వెళ్లినప్పుడు అక్కడ ప్రజలు ఏపి సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తారని విషయాలు ప్రజలకు తెలియలేదని చెప్పడం జరిగిందన్నారు. అలా కాకుండా జగనన్న సురక్ష క్యాంపులో మనం ఏపి సర్టిఫికెట్లను అందజేయగలరు వాటి గురించి ప్రజలకు పూర్తి అవగాహన కలిగించాలన్నారు. సచివాలయ సర్వీసులకు సంబంధించిన పేమెంట్స్ ఇంకా చాలా మండలాల్లో పెండింగ్ ఉందని వెంటనే చెల్లించేలా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దీనిపై ప్రత్యేక దష్టి పెట్టి గురువారం సాయంత్రానికల్లా పేమెంట్ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా ఏపీ సేవా సర్వీసులకు సంబంధించి పెండింగ్ లేకుండా ఈవారం లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డాక్టర్ వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీస్ నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి నిర్దేశించిన సమయానికి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈసమావేశంలో సిపిఓ ఉమాదేశవి, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈలు ఉమామహేశ్వర్‌రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, శంకర్‌బాబు, హౌసింగ్, డ్వామా పిడీలు పద్మనాభం, గంగాభవాని, జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు మురళీకష్ణ, ప్రభాకర్, డిపిఓ లక్ష్మీ, ఎడిఎల్‌డిఓలు రవికుమార్, ఉమాదేవి, డీఎస్‌ఓ.శంకర్ తదితరులు అధికారులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

దేశంలో ఎక్కడా లేనంత సహకారం: మంత్రి ఆర్కే రోజా

రూ.13.27 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ



మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు అందిస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి

మహిళాభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక, సాంకేతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 80 గ్రూపులకు గాను రూ.13.27కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు దేశంలో ఎక్కడా, ఏప్రభుత్వం అదించలేనంత చేయూతని జగనన్న ప్రభుత్వం అందిస్తోందన్నారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ రుణాలతో ఈ రాష్ట్రంలో పేదింటి మహిళలకు స్వయం ఉపాధికి జగనన్న తోడ్పాటు అందిస్తున్నారని అన్నారు. ఈదేశంలో ఎక్కడైనా మహిళలకు ఇంతటి సహకారం ఉంటే చూపించండని సవాల్ చేశారు. ఒక్క వైఎస్సార్ ఆసరా ద్వారా రాష్ట్రంలోని సుమారు 80లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగనన్న ప్రభుత్వం అందించిన మొత్తం సాయం రూ.19,178 కోట్ల అన్నారు. గత ప్రభుత్వపాలనలో చంద్రబాబు హామీలె ఇచ్చి డ్వాక్రా మహిళలకు టోకరా వేశారన్నారు. రూ.14,200 కోట్లు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ఎగనామం పెట్టాడన్నారు, ఆడవాళ్ల బంగారం బ్యాంకుల నుండి విడిపిస్తానని మోసం చేశాడని, ఒకవైపు రుణాలు మాఫీ చేయకపోగా సున్నావడ్డీ పథకం సైతం ఎగ్గొట్టాడన్నారు. అక్కచెల్లెమ్మలు బ్యాంకులకు అపరాధపు వడ్డీతో సహా చెల్లించాల్సిన దుస్థితి కలిగిందన్నారు. దీంతో ఏ గ్రేడ్‌లో ఉన్న సంఘాలు కూడా సీ,డీ గ్రేడ్‌లలోకి పడిపోయాయన్నారు. ఆ స్థితిలో ఉన్న స్వయం సహాయక సంఘాలకు జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ప్రాణం పోశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.75 వేలను వారి స్వయం ఉపాధికి అందిస్తున్నారన్నారు. ఆర్డీవో సుజన, మెప్మా పీడీ రాధమ్మ, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మెప్మా డీపీఎంయూలు వి.బాబు, జయరాం, హౌసింగ్ డీఈ శంకరప్ప, మెప్మా టీఎల్ఎం సునీత, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, వెంకట రత్నంరెడ్డి, కౌన్సిలర్లు దయానిధి, బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, మునికష్ణారెడ్డి, భారతి, బిలాల్, మోహన్‌రాజ్, భూపాలన్ కోఆప్షన్ సభ్యులు, ఆనంద్ కుమార్, ఎల్లప్పరెడ్డి, హమీద్, కష్ణమూర్తి, యాకోబు, ఆర్పీలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

'ఆశా'లను భయపెట్టడం దుర్మార్గం

జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం డిఎంఎన్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు మంగళవారం చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేయడానికి రాష్ట్రకమిషనర్ నుంచి జిల్లా అధికారుల వరకు ఆశాలను బెదిరించే మెసేజులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లు అవుతుందని అన్నారు. సోమవారం ఒక ప్రకటనలో వైద్యఆరోగ్యశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులే ఈ విధంగా చేయడం ఏమిటని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ప్రశ్నించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆశాలు చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నదని తెలిపారు. ఆశా కార్మికులకు పనిభారం తగ్గించి, సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, అధికారుల వేధింపులు మానుకోవాలన్నారు. పనిచేసే ఫోన్స్ 4జి సిమ్స్ ఇవ్వాలని లాంటి సమస్యల పరిష్కారం చేయకుండా వారి సమస్యలపై రాజ్యాంగ కల్పించిన హక్కు ప్రకారం నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ ఆవిధంగా చేయడం నేరమని చర్యలు తీసుకుంటామని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఆశా కార్మికులను బెదిరించడం మానుకొని వారి సమస్యలను పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులతో ఉద్యమాలు అడ్డుకోలేరు

ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగా

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్స్ యూనియన్ మంగళవారం డిఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయం వద్ద నిరసనకు పిలుపునిస్తే నిరసన కార్యక్రమాన్ని అడ్డుకొనేలా సర్క్యులర్ జారీ చేయడం పట్ల ఆశా వర్కర్స్ యూనియన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా స్థాయి వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక వైద్యఅధికారులు నిరసన కార్యక్రమంలో పాల్గొనకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సర్క్యులర్లు, బెదిరింపులతో ఉద్యమాలను అడ్డుకోవడం సాధ్యం కాదని హెచ్చరించారు.

రీసర్వే పనులు వేగవంతం

బియ్యం విక్రయ కేంద్రాలు ప్రారంభించండి: జెసి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గడువు నిర్ణయించుకున్న తహశీల్దార్లు రీసర్వే పథకానికి సంబంధించి లక్ష్యాలను చేరాలని అదేవిధంగా అసైన్మెంట్ భూములను గుర్తించి పట్టాలను సిద్ధం చేయాలని, సరసమైన ధరలకు అందించే మరిన్ని బియ్యం విక్రయ కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి తహశీల్దార్లు, సర్వేసిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమం వేగవంతంగా నిర్వహించాలని, లక్ష్యాలను చేరే విధంగా చూడాల్సిన బాధ్యత తహశీల్దారులపై ఉందన్నారు. కొన్ని ప్రాంతాలలో 22ఏ కింద ఉన్న భూములను గుర్తించి సమస్యను పరిష్కరించి రీసర్వే కార్యక్రమం వేగవంతంగా జరిగేటప్పుడు చూడాలన్నారు. లక్ష్యాలను నిర్ణయించుకున్నప్పుడు వాటిని చేరే విధంగా తగుచర్యలు కూడా తీసుకోవాలన్నారు. జిల్లాలో అసైన్మెంట్ భూములను గుర్తించడం జరిగిందని లబ్ధిదారుల జాబితాలతో పాటు వారికి ఇవ్వాలని భావిస్తున్న సర్టిఫికెట్లను తహశీల్దార్ కార్యాలయాలలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వన్ బి, అడంగల్, ఎఫ్, బి ప్రొఫార్మా ప్రకారం సిద్ధం చేయాలన్నారు. సివిల్ సప్లై మార్కెటింగ్ శాఖ వారు సమన్వయం చేసుకొని సరసమైన ధరలకు అందించే మరిన్ని బియ్యం విక్రయ కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం లోపు కార్డుదారులకు రేషన్ పంపిణీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిఎస్‌ఓ శంకరన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ఎన్ఎంఆర్‌కు ద్రోహం చేశారు'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సహకార చక్కెర ఫ్యాక్టరీలో ఎన్ఎంఆర్‌లుగా పనిచేస్తున్న వారికి ప్రభుత్వం తీరని దోహం చేసిందని ఎన్ఎంఆర్‌లు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా లోకనాధం మాట్లాడుతూ సహకార షుగర్ ఫ్యాక్టరీ మూత పడ్డాకా నాటి నుంచి నేటి వరకు బకాయిల కోసం ఎదురు చేస్తున్నామని అయితే ఏడు నెలల జీతం రూ.30వేలు, 35వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని 40 సంవత్సరాలుగా ఎన్ఎంఆర్‌లుగా చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు లక్షలు చెల్లించిన ప్రభుత్వం ఎన్ఎంఆర్‌ల విషయంలో అన్యాయం చేయడం సరికాదని అన్నారు. 348మంది ఎన్ఎంఆర్‌లు పుట్టెడు దుఖంలో ఉన్నారని ప్రభుత్వం ఎన్ఎంఆర్‌లకు సముచిత న్యాయం చేయాలని కోరారు.



న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌కు వచ్చిన ఎన్ఎంఆర్‌లు

ప్రజల ముంగిళ్లలోకే సేవలు: మంత్రి

ప్రజాశక్తి-నగరి: దేశచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలందరికీ పూర్తిస్థాయిలో మేలు చేయాలన్న దృఢ సంకల్పంతో అర్హులందరికీ అండగా నిలిచే సేవా యజ్ఞాన్ని జగనన్న సురక్షతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారని మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో సురక్షలో నమోదు చేసుకున్న 217 ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్‌లు, 219 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, జనన ధ్రువీకరణ పత్రాలు 9 మందికి, వివాహ ధ్రువీకరణ పత్రాలు ఇద్దరికి, అడిషన్, స్ప్లిట్టింగ్ 5, హౌస్‌హెూల్డ్ స్ప్లిటింగ్ ఒకరికి, కొత్త బియ్యం కార్డు ఒకటి, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ ఒకరికి అంటూ 455 మందికి సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయపరిధిలో సంక్షేమం, అభివద్ధికి రూ.20.72కోట్లు వెచ్చించామన్నారు. 72 మందికి ఇళ్ల నిర్మాణానికి రూ.1.29 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందన్నారు. ఇదిగాక ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇం



ధ్రువపత్రాలు అందుకున్న వారితో మంత్రి రోజా

బర్స్‌మెంట్ అంటూ ప్రజలకు లబ్ది చేకూరిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం త్వరలో గ్రామంలో నిర్వహిస్తామని ఇక్కడ తన దష్టికి వచ్చిన సమస్యలను గడపగడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా నెరవేరుస్తామన్నారు. రెండుసార్లు ప్రజలు ఇచ్చిన ఆదరణతోనే నేడు మంత్రిగా ఉన్నానని ప్రజల పక్షాన నిలబడ్డ తనను ప్రజలు మూడోసారి కూడా తప్పక ఆదరిస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌ఛైర్మన్ బాలన్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్లు గంగాధరం పాల్గొన్నారు.

సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సర్పంచి భాషా మసూద్ సోమవారం తెలిపారు. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి 11 రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించి ప్రజలకు ధ్రువపత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని కార్యదర్శి జయశంకర్ తెలిపారు. ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

మానిటరింగ్ సమావేశాలు నిర్వహించాలి


ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-గంగవరం: జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల మేరకు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని మండల ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు డి.వి. మునిరత్నం, ఈశ్వర్, మురళి లు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుండి మండలంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీలు సమావేశాలు నిర్వహించలేదని, ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమావేశాలు నిర్వహించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యలు తీరక, ఎవరికి చెప్పుకోవాలో తెలియక చాలా ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. 1235 జీవో ప్రకారం ఎస్సీ, ఎస్టీ కాలనీలకు రెండు ఎకరాలు శ్మశాన భూమి కేటాయించాలని ఉన్నప్పటికీ ఇంతవరకు ఒక్క గ్రామానికి కూడా కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. అనంతరం తహశీల్దార్ అమర్‌నాథ్‌కు డిమాండ్లతో కూడిన మెమెరాండంను సమర్పించారు. తహశీల్దార్ స్పందిస్తూ తప్పకుండా మానిటరింగ్ కమిటీ సమావేశాలు, పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుబ్బమ్మ, సోము, సుబ్బు, జయరామయ్య, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, బాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించండి


తహశీల్దార్‌ను సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న భూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని ప్రజా సంఘాల నాయకులు, మాల మహానాడు అధ్యక్షుడు టి.ఎం. మంజునాథ్ ఆధ్వర్యంలో తహశీల్దార్ లోకేశ్వరరావును సోమవారం కలిసి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దళితులకు శ్మశానవాటికలు లేవని, మౌలిక వసతులు జాడే లేదని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రజా సంఘాల నాయకులు తెలియజేసే సమస్యలను సత్వర పరిష్కారానికి కషి చేయాలని తహశీల్దార్ లోకేశ్వరరావును కోరినట్లు వారు తెలిపారు. అనంతరం వారు తహశీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తిప్పన్న, జయప్ప, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానించిన దృశ్యం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని తమ్మినాయుని పల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో పాఠశాల నుండి బదిలీ అయి కె.వి.పల్లి మండలానికి వెళ్ల డంతో సదరు ఉపాధ్యాయుడు యాసిన్‌ను ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. యాసిన్ తమ్మి నాయుడు పల్లి పాఠశాలలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించేవాడని ఆయన సేవలను ఉపాధ్యాయ బృందం కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పెద్ద చల్లారగుంట పంచాయతీ పరిధిలో గల గాజీపేట గ్రామంలోనీ అంగన్‌వాడీ కేంద్రంలోని ఏడబ్ల్యూహెచ్‌కి టీచర్‌గా ప్రమోషన్ రావడంతో హెల్పర్ పోస్ట్ ఖాళీ అయినట్లు గుర్తించి దాన్ని భర్తీ చేయుటకు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వారు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిల్డ్రన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.మాధవి లక ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తు చేసుకునే వారు 2023వ సంవత్సరం జులై 1వ తేదీకి 21 నుండి 35 సం.లోపల వయసు కలిగి ఉండి, టెన్త్ పాసై ఉండాలని తెలిపారు. స్థానికంగా నివాసమున్నట్లు సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. జీతం రూ.7 వేల వరకు ఉంటుందని ఆసక్తి కలవారు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 10 తరగతి పాసైన సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ సేకరించి గెజిటెడ్ ఆఫీసర్ సంతకం చేయించి పోస్టు ద్వారా, నేరుగా గానీ మా ఆఫీసుకి ఈ నెల 22వతేదీ లోపు అందజేయాలని ఆమె తెలిపారు.

మండల రీసోర్స్ కోఆర్డినేటర్లుగా సాక్షర భారత్ కోఆర్డినేటర్లు


మంత్రి పెద్దిరెడ్డితో సాక్షర భారత్ కోఆర్డినేటర్లు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్లుగా పనిచేసిన వారిని మండల రీసోర్స్ కోఆర్డినేటర్లుగా ప్రభుత్వం నియమించినట్లు గతంలో మండల కోఆర్డినేటర్లు యూనియన్ ప్రెసిడెంట్‌గా భాద్యతలు వహించిన సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రలో గతంలో పనిచేసిన సాక్షభారత్ మండల కోఆర్డినేటర్లు కలసి వారి సమస్యలను తెలియజేయగా మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని అందుకు అనుగుణంగా మండల నీటిపారుదల శాఖలో పారిశుద్ధ్య నిర్మూలన విభాగంలో వారి నియమించినట్లు ఆయన తెలిపారు. మాకు మండల స్థాయిలో ఉద్యోగాలు రావడానికి సహకరించిన మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీ.రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యంను కలసి కతజ్ఞతలు తెలియజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గతంలో పనిచేసిన రాష్ట్ర అధ్యక్షుడు సిద్దారెడ్డి, బైరెడ్డిపల్లి సురేష్, బాబు, కుప్పం నియోజకవర్గం వాసు, మోహన్, భాస్కర్ పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్ విద్యార్థులపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-పలమనేరు: ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియాపైన, డ్రాప్ అవుట్ విద్యార్థులు, మధ్యాహ్న భోజనం పథకం పైన దష్టి సారించాలని జిల్లా అసిస్టెంట్ ఎడ్యుకేషన్ సర్వ శిక్ష ప్రాజెక్ట్ అధికారి వెంకటరమణారెడ్డి సోమవారం తెలిపారు. అందులో భాగంగా సోమవారం పట్టణంలోని ఓఎల్ఎల్ పాఠశాలలో పలమనేరు, గంగవరం మండలం మండల శాఖ విద్యాధికారులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో నాడు-నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాప్ అవుట్ విద్యార్థులపై వాలంటీర్ల సర్వేపై సూచనలు చేస్తూ రేపు మధ్యాహ్నంలోగా వార్డు, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సర్వే పూర్తి చేసి మండల విద్యాశాఖకు అందించాలని సూచించారు. అలాగే గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో అనగా ఐదు సంవత్సరముల నుండి 14 సంవత్సరం వరకు పిల్లలు 1-09-2005 నుండి 20-05-2018 సంవత్సరం మధ్యలో


మాట్లాడుతున్న సర్వ శిక్ష ప్రాజెక్ట్ అధికారి వెంకటరమణారెడ్డి

పుట్టిన పిల్లలు కచ్చితంగా పాఠశాలలో గాని కాలేజీలో గాని చేర్పించాలని తెలిపారు. అలాగే 10వ తరగతి పాస్ అయినా పిల్లలు ను కాలేజీలో చేర్చే విధంగా కషి చేయాలని తెలిపారు 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఓపెన్ పరీక్షలు రాసే విధంగా కషి చేయాలి అన్నారు. జూలై నెలాఖరులోగా నాడు నేడు పనులు పూర్తి చేయాలని సూచించారు.

మంత్రి పెద్దిరెడ్డికి అతిథి అధ్యాపకుల మొర

ప్రజాశక్తి-గుడిపల్లి: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం అతిథి అధ్యాపకులు తమకు జీతాలు ఇప్పించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదేవిధంగా వారి కష్టాలను ఆయన దగ్గర విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 472 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 1081 మంది పైగా అతిథి అధ్యాపకులు (గెస్ట్ ఫ్యాకల్టీ) 2012లో కాంట్రాక్టు లెక్చరర్లను నిలుపుదల చేసిన తర్వాత నుండి గత 9 సంవత్సరాలుగా పని చేస్తున్నాము. నెల నెల జీతం పొందక కూడా సంవత్సరానికి ఒకేసారి జీతం పొందుతూ ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నాము. అంతేకాకుండా 2020-21,2021-22 విద్యా సంవత్సరంకు గానూ రెండు సంవత్సరాల నుంచి జీతం పొందకుండా పేద విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్, కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ వారికి నెల నెలా మెరుగైన జీతభత్యాలు పొందుతున్నారు. మాకు ఇప్పటికీ జీతం నెలకు రూ.10 వేల చొప్పున సంవత్సరం మొత్తానికి ఎనిమిది నెలలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇది కూడా సంవత్సరం ఒకసారి మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ విధంగా జీతాలు లేక కుటుంబ పోషణ, ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా అధ్యాపకుల ప్రధాన కార్యదర్శి కుమార్, ట్రెజరర్ రజనీకాంత్, హరీష్, మోహన, రోజా, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రాష్ట్ర టిడిపి మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనితపై అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ నేతలపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, అవినీతిపై ప్రశ్నిస్తే వైసీపీ నేతలు తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. అసభ్యకరమైన పదజాలంతో పోస్టులు పెడుతున్న వారిని ప్రభుత్వం స్పందించి అరెస్టు చేయకుంటే రానున్న రోజుల్లో టిడిపి నేతలతో పాటు ప్రజలు తిరగబడే రోజులు


దేవ సుందరం (ఫైల్ ఫోటో)

దగ్గరలోనే ఉన్నాయన్నారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చారని, వైసీపీ అసమర్థ విధానాలపై ప్రశ్నిస్తే వాటికి సమాధానం చెప్పలేక అసభ్యకర మెసేజ్‌లు పెట్టి వారిని మానసికంగా వేధించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే వైసీపీ పాలనపై ప్రజలు విసిగి వేశారిపోయారని, రానున్న శాసనసభ ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని, దీన్ని గుర్తించుకుని అధికార పార్టీ నేతలు మెలగాలని వైసీపీ నేతలకు ఆయన హితవు పలికారు.

బకాయిలు చెల్లించాలని విద్యార్థుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: విద్యాదీవెన, అమ్మఒడి, వసతి దీవెన బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదని నేపథ్యంలో చిత్తూరు పట్టణంలోని కొంగారెడ్డి పల్లి కొత్త బస్టాండ్ నుంచి గాంధీ స్టాచు వరకు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ప్రభుతేజ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుతేజ మాట్లాడుతూ చంద్రన్న ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్‌మెంట్ ఇవ్వగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దానిని 10.97లక్షల మంది విద్యార్థులకు కుదించడం దుర్మార్గమని విమర్శించారు. చంద్రబాబు నాయుడు హయాంలో 3వ స్థానంలో ఉన్న రాష్ట్రం జగన్ మోహన్ రెడ్డి హయాంలో 19వ స్థానానికి దిగజారిందన్నారు. ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో చదివే పీజీ విద్యార్థులకు 2020-21 విద్యాసంవత్సరం నుంచి జగనన్న విద్యాదీవెన నిలిపివేస్తూ జీవో నెం.77ను విడుదల చేశారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిలు విడుదల చేయలేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడుద్దామని హెచ్చరించారు.

గాలి జగదీష్ పర్యటన



ప్రజాశక్తి-నగరి: విజయపురం మండలంలోని కాళికాపురం గ్రామంలో ప్రజల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి గాలి ముద్దుక్రిష్ణమ నాయుడు తనయుడు గాలి జగదీష్ పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గాలి జగదీష్ గ్రామంలోని సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక రాస్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం స్థానిక జ్ఞానప్రకాష్ మొదటి వర్ధంతి సందర్భంగా అన్నదానం, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్ఞానప్రకాష్ తల్లితండ్రులు గుణవతి, లోకనాధంనాయుడు, మహేష్, ఆదిలక్ష్మి, శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు, పర్యవేక్షకులు ప్రకాష్ పాల్గొన్నారు.

శ్రీవాణి, శ్రీపద్మావతి కళాశాలల ప్రభంజనం

ప్రజాశక్తి-గంగవరం: మేలో జరిగిన డిగ్రీ తృతీయ సంవత్సరం డిగ్రీ ఫలితాలలో శ్రీవాణి, శ్రీపద్మావతి విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో అత్యధిక ఉత్తీర్ణత సాధించారని కళాశాల కరస్పాండెంట్ సి.పి.బాలసుందరం రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫలితాలలో 50 మంది డిస్టింక్షన్‌లో, 32 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.ఈ విజయానికి కారణమైన అధ్యాపకులను, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ కె.క్రిష్ణమూర్తి రెడ్డి అభినందించారు.

శ్రీ చౌడేశ్వరి దేవి సేవలో నాయకులు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని ఎద్దుల చెరువు వద్ద గల శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ ఉత్సవాల్లో స్థానిక శాసనసభ్యులు వెంకటే గౌడ, మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డిలు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శాసనసభ్యుడిని దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.





పంచాయతీ నిధులు కాజేశారని ఎస్పీకి ఫిర్యాదు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: 14,15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు సర్పంచుల బ్యాంకు ఖాతాల్లో కనిపిం చడం లేదని, 12,918 గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల ఖా తాల్లో సిఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జీరో బ్యాలెన్స్ చూపుతోందని అధికార పార్టీ పంచాయతీల నిధులు కాజేసిందంటూ ఏపీ సర్పంచుల సంఘం ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ నాయకులు సోమవారం జిల్లా ఎస్పీని కలసి ఫిర్యాదుచేశారు. సర్పంచుల సంఘం నాయకులు కోకా ప్రకాష్ నాయుడు, ధనంజయ యాదవ్, చింతా కిరణ్ యాదవ్, సుబ్బరామయ్యలు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం గ్రామ సర్పంచ్‌ల నిధులు కాజేశారన్నారు. నిధులు లేక పంచాయితీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేక రెండు సంవత్సరాలుగా సర్పంచులు ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నట్లు వాపోయారు. సర్పంచ్‌ల చెక్‌లపై సంతకాలు, అనుమతి, గ్రామపంచాయతీ తీర్మానం లేకుండా సర్పంచులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నిధులను కాజేసిన అధికార పార్టీపై కేసు నమోదు చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు.

మదర్ థెరిసా కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గంగవరం: పలమనేరులోని మదర్ థెరిసా ఎంసీఏ, ఎంబీఏ కళాశాలలోని విద్యార్థులు గత సంవత్సరం జరిగిన రెండవ, మూడవ సెమిష్టరు పరీక్షలలో విశేషమైన ప్రతిభ చూపి, నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని, డిస్టింక్షన్లు, ప్రథమ శ్రేణిలో పాసై యూనివర్శిటీలోనే టాపర్స్‌గా నిలిచారని కళాశాల కరస్పాండెంట్ యం.రవీంద్రబాబు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ ఎంసీఏ రెండవ సెమిస్టర్‌లో 65 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 55 మంది డిస్టింక్షన్‌లో, మిగిలిన 10 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు అలాగే ఎంబీఏ మూడవ సెమిస్టర్‌లో 117 మంది పరీక్షలు రాయగా 49 మంది డిస్టింక్షన్‌లో, 68 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ప్రతిభను చాటారన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ ఎం.రవీంద్రబాబు, ఛైర్మన్ ఎం.ఆర్.సునీల్, అకాడమిక్ డైరెక్టర్ రాజేంద్ర రెడ్డి, ఎంసీఏ కళాశాల ప్రిన్సిపల్ రాజకుమార్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరావు, హెచ్ఓడీ ప్రభాకర్ నాయుడులు అభినందించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి పరికరాల వితరణ


ఆసుపత్రికి పరికరాలను అందిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్రజాశక్తి-నగరి: స్థానిక ఓంశక్తి ఆలయంలో సోమవారం నిర్వహించిన ఆలయ 37వ వార్షికోత్సవం, 31వ గురు పాదోత్సవాన్ని పురస్కరించుకొని అభిషేక అర్చనలు, 1008 పుష్పార్చనలు, పంచముఖ దీపారాధన నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు చక్రాల కుర్చీలు, పరుపు దిండ్లు, బాలింతలకు బెడ్లు, పండ్లు, బిస్కెట్లు, చెవిటి వారికి వినికిడి పరికరాలు, వికలాంగులకు చేతి కర్రలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం ఆలయంలో సహపంక్తి భోజనం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ కష్ణమూర్తి, వైద్యులు జరీనా, కార్తికేయన్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది ఆదిలక్ష్మి, ప్రసాద్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: నేడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని బంగారుపాళ్యం 2 సచివాలయంలో జరుగుతుందని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో బంగారుళ్యం 2 సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు పాల్గొంటారని తెలిపారు. మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నూతన బోరు ఏర్పాటు


నూతన బోరు ఏర్పాటుకు డ్రిల్ చేస్తున్న దృశ్యం


ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఎస్.నడింపల్లి పంచాయతీ కరకమంద గ్రామంలోని పోలేరమ్మ గుడి సమీపంలో హై పవర్ వాటర్ ప్లాంట్‌కు నీటి సరఫరాకు సర్పంచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో నూతన బోరు బావిని సోమవారం డ్రిల్లింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శుద్ధిచేసిన తాగునీరు గ్రామ ప్రజలకు అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీనికి నూతన బోరును డ్రిల్లింగ్ చేసి నీటిని సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని నీరు పడటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన పాలేటి అమ్మవారి జాతర

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నెల్లిమంద పంచాయతీలో ఆది, సోమవారాలలో నిర్వహించిన పాలేటి అమ్మవారి జాతర ఘనంగా ముగిసింది. ఆదివారం సాయంత్రం నుండి సోమవారం ఉదయం వరకు పంచాయతీ పరిధిలోని గ్రామాల వారు విద్యుత్ దీపాలతో అలంకరించిన పల్లకీలను ఆలయం వద్దకు తీసుకువచ్చి ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేయించారు. సోమవారం మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించి పొంగళ్ళు సమర్పించారు. జాతరను తిలకించేందుకు సోమల, కందూరు, సదుం, కలికిరి ప్రాంతాల నుండి భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని దిగువపల్లి పంచాయతీ యానాది పాళ్యానికి చెందిన డి పాపయ్య (35) గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద అనుమానాస్పదంగా ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసుల వివరాలు మేరకు... కుటుంబ కలహాల కారణంగా మతుడు పాపయ్య ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడించారు. మృతుని భార్య గంగులమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలియజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని పెద్ద చలారి గుంట పంచాయతీ పరిధిలో పుంగనూరు జాతీయ రహదారి సమీప క్రాస్ వద్ద స్థానిక ఎస్సై వెంకట నరసింహులు తన సిబ్బందితో ఆదివారం రాత్రి దాడులు నిర్వహిస్తుండగా, పలమనేరు మండలం గండిమిట్ట కాలనీకి చెందిన రాఘవేంద్ర (33) ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 480 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకొని మద్యాన్ని, హీరో హోండా ప్యాషన్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్


అరెస్టు చేసిన వ్యక్తితో పోలీసులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: చట్ట విరుద్ధంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై టి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సై వివరాల మేరకు... ముందస్తు సమాచారంతో పలమనేరు శంకర్రాయల పేట రోడ్డులో, శివాడి గ్రామ చెరువు కట్టమీద, మండల తహశీల్దార్ లోకేశ్వర రావు, గంగవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్, స్థానిక ఎస్సై టి.శ్రీనివాసులు సిబ్బందితో కలసి గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని విచారించగా శివాడి గ్రామానికి చెందిన శివశంకర్ కుమారుడు గుండ్లపల్లి వినయ్ ఏ విక్కీ(27) ఇతను చిన్నప్పటి నుండే చిన్న చిన్న దొంగతనాలు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో తన అవసరాలు తీర్చుకుంటూ వుండేవాడని, మద్యం, గంజాయికి అలవాటు పడి డబ్బులకోసం గంజాయిని తీసుకొని వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముకొంటూ ఉండేవాడని తెలిపారు. సోమవారం ఉదయం అతని వద్ద వున్న 2.200 గ్రాముల గంజాయిని ఒక నల్లటి కవర్లో తీసుకొని బెంగళూరు సిటి, కె.ఆర్ పురంకు వెళ్ళి అమ్ముకుందామని వాళ్ళ ఇంటినుండి బయలుదేరి శివాడి చెరువు కట్టమీద నడుచుకొని వస్తూవుండగా పంజాణి పోలీసులు పట్టుకొని, పంజాణి తహశీల్దార్ సమక్షంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. గంగవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ మండల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయిని తరలించిన లేక సేవించిన లేక అమ్మిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు గంజాయిని ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే స్థానిక పోలీసువారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు


క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-సోమల: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు... మండలంలోని ఇరికిపెంట పంచాయతీ చెన్నపట్నం చెరువు డ్యాం సమీపంలోని మేటి మంద క్రాస్ వద్ద సోమవారం ఉదయం లగేజ్ ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలు కాగా, గాయపడ్డ వారిని సోమల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం. గాయపడ్డ వారు మునిరత్నం, తేజేష్, రెడ్డప్ప, సాత్విక్‌లు గా ఆసుపత్రి వర్గాలు తెలియజేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.